క్లుప్తంగా

పెద్దమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం కావడంతో ఉదయమే అమ్మవారిని నూతన పట్టువస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యంలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంధుల పాఠశాలకు సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న స్ఫూర్తి సేవా సమితి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన స్ఫూర్తి సేవా సమితి సభ్యులు ఆదివారం సెయింట్ లూక్ అంధుల పాఠశాల విద్యార్థులకు నిత్యవసర సరుకులు అందజేశారు. స్ఫూర్తి సేవాసమితి అధ్యక్షుడు తోట మురళి మాట్లాడుతూ రూ.11వేలు విలువైన నిత్యవసర సరుకులు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఏడాది పేదలకు ఉచిత వైద్యం, ఆర్థిక సహాయ సహకారాలు అందజేస్తున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



ప్రత్యేక అలంకారంలో కాశీవిశ్వనాథుడు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో వెలసిన రామాలయంలో ఆదివారం దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన, కుంకుమార్చన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శ్రీ కాశీ విశ్వనాథ అన్నపూర్ణాదేవిలకు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులచే శాస్త్రోక్తంగా లక్ష బిల్వార్చన, సామూహిక లక్ష కుంకుమార్చన చేపట్టారు. మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీదేవి, కౌన్సిలర్ విజయ భాస్కర్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

'పసి నవ్వుల అలలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల రచయిత కొప్పుల ప్రసాద్ రచించిన 'పసి నవ్వుల అలలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని తెల్లాపూర్ సమావేశ భవనంలో ఆదివారం ఘనంగా జరిగింది. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఏఎల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పుస్తకం ఆవిష్కరణ చేశారు. అనంతరం డాక్టర్ వి.డీ రాజగోపాల్ సమీక్ష చేశారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో సత్కారం పొందిన కొప్పుల ప్రసాద్‌ను నంద్యాల పట్టణ సాహితీ వేత్తలు, తెలుగు పండితులు, భాషాభిమానులు, డాక్టర్ సహదేవుడు, అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ ఉదయ శంకర్, అన్నెం శ్రీనివాసరెడ్డి నరేంద్ర వివిధ కళాశాలల అధ్యాపకులు అభినందించారు.

చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బాలికలు

చాగలమర్రి: బాలికల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని చర్చీలలో ఆదివారం బాలికలు ప్రత్యేక ఆరాధనలు చేశారు. పెద్దబోధనం గ్రామం సీఎస్ఐ చర్చిలో బాలికలు ప్రార్థనలు చేశారు. రెవరెండ్ సంపత్ కుమార్ బాలికలను ఉద్దేశించి ప్రసంగించారు. బాలికల విద్యాభివృద్ధికి క్రైస్తవ మత బోధకుడు విలియం కేరి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.

ఓటరు నమోదుకు 20 దరఖాస్తులు

ఉయ్యాలవాడ : మండలంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి ఆదివారం రెండవ రోజు యువతి, యువకుల నుంచి 20 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బాబు తెలిపారు. ఫారం-6 ద్వారా పురుషులు-12, మహిళలు-4, ఫారం-8 ద్వారా పురుషులు-8 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డీటీ వివరించారు.

తీరని వంతెన కష్టాలు

- ఇంజేడు సమీపంలో శిథిలావస్థకు చేరిన వంతెన
- వర్షాకాలంలో మాయలూరు – ఆళ్లగడ్డ రహదారిలో రాకపోకలకు అంతరాయం
- హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం పనులు చేపట్టకపోవడంతో నిధులు రద్దు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ఇంజేడు సమీపంలో కుందరవాగుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్)



పెద్దయమ్మనూరు సమీపంలో భూమికి సమాంతరంగా వున్న వంతెన

ఉయ్యాలవాడ: కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ప్రయాణికులకు వంతెన కష్టాలు తీరడంలేదు. ఇంజేడు సమీపంలో కుందరవాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు చేపట్టకపోగా నిధులను రద్దు చేసింది. ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని వంతెన నిర్మాణానికి మళ్లీ నిధులు మంజూరు చేయించి వంతెన కష్టాలు తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

15 గ్రామాలకు తప్పని ఇబ్బందులు

మండలంలోని మాయలూరు – ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో 15 గ్రామాల ప్రజలను వంతెన కష్టాలు వెంటాడుతున్నాయి. ఇంజేడు గ్రామ సమీపంలో కుందరవాగుపై 40 సంవత్సరాల క్రితం నిర్మించిన లోలెవెల్ వంతెన శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిల చొరవతో హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ.5కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు ప్రారంభించకపోవడంతో పాటు నిధులు రద్దు చేసింది.

ఒక మోస్తరు వర్షం కురిసినా..

ఒక మోస్తరు వర్షం కురిసినా పంట పొలాల్లో నుంచి వచ్చే వర్షపు నీరు కుందరవాగులోకి చేరి వంతెనపై ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ప్రతి ఏటా వర్షాకాలం తాడిపత్రి, ఆళ్లగడ్డ, నంద్యాల, కోవెలకుంట్ల పట్టణాల వైపు వెళ్లే ఆర్‌టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు స్తంభించి పోతున్నాయి. వాగుపై ఉధృతి తగ్గేంత వరకు ఆయా గ్రామాల ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు రెండు మూడు రోజులు రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.

పెద్దయమ్మనూరు వద్ద..

భీమునిపాడు– ఆర్.జంబులదిన్నె ఆర్‌అండ్‌బీ రహదారిలో పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలో భూమికి సమాంతరంగా వంతెన వుండడంతో వర్షాకాలం వంతెనపై నీరు నిలిచి ఉంటుండతంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు 15 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి పెద్దయమ్మనూరు, కాకరవాడ, బోడెమ్మనూరు గ్రామాలకు చేరుకోవల్సి వస్తోంది. హైలెవెల్ వంతెన ఏర్పాటు చేస్తే 15 కిలో మీటర్లు చుట్టూ తిరిగి వచ్చే బాధలు తప్పిపోతుందని ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు

ఏడు నెలల క్రితం హైలెవెల్ వంతెన నిర్మాణానికి రూ. 5 కోట్లు నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. రెండు పర్యాయాలు టెండర్లకు పిలవడం జరిగింది. కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. గత నెల 28వ తేదీన పనులు ప్రారంభించని రహదారులు, వంతెనలకు సంబంధించి ప్రభుత్వం నిధులు రద్దు చేసింది.

– సునీల్‌రెడ్డి, డీఈ ఆర్‌అండ్‌బీ

వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలి



మాయలూరు– ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలో కుందరవాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలి. చిన్నపాటి వర్షాలకు వాగు ఉప్పొంగి ప్రవహిస్తూ వుంది. ప్రస్తుతం వంతెన లోలెవెల్‌లో వుండడం, రక్షణ గోడ లేక ప్రయాణికులు చిన్నపాటి వర్షం వచ్చినా వంతెనపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– లక్ష్మీనారాయణరెడ్డి, ఇంజేడు

జగన్ పథకాలను రద్దు చేయడం చంద్రబాబుకు తగదు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను రద్దు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయంగా పెట్టుకున్నట్లు ఉన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కుందరవాగు వంతెన కష్టాలు ఎదుర్కొంటున్నామని ప్రజల అభ్యర్థన మేరకు నాటి ప్రభుత్వం నూతన వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం రద్దు చేయడం విడ్డూరంగా ఉంది.

– ఉమామహేశ్వరమ్మ, ఉయ్యాలవాడ

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(అర్బన్): 104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, 104 యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కోరారు. 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట దీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో, ఇటీవల జరిగిన విజయవాడ వరద సమయాల్లోను 104 ఉద్యోగులు చేసిన సేవలు మరువలేనివన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలు, డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం ఆప్కాస్‌లో విలీనం చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐలో ఇంత వరకు మోసం చేసిన పీఎఫ్ సొమ్మును అరవింద ఫార్మ యాజమాన్యం ద్వారా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో 104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు జగదీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ హుసేన్‌బాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా విశేషంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారుల అదుపులో వ్యక్తి?

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రికి చెందిన ఫయాజ్ అనే వ్యక్తిని వైఎస్సార్ జిల్లా, మైదుకూరుకు చెందిన అటవీశాఖ అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఫయాజ్ సెల్ పనిచేయకపోవడంతోపాటు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చాగలమర్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎర్ర చందనం అక్రమ రవాణా కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మధ్యంతర భృతిని ప్రకటించాలి



మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): 2023 జూలై నుంచి పీఆర్సీని అమలు చేయాలని, లేని పక్షంలో మధ్యంతర భృతిని 30 శాతం ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాల ఫైనల్ పేమెంట్‌లను తక్షణమే విడుదల చేయాలన్నారు. 2022వ సంవత్సరం నుంచి ఉపాధ్యాయుల సంపాదిత సెలవుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇంత వరకు వాటికి సంబంధించిన నగదును జమ చేయలేదన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం కమిటీ సభ్యులు వీరేశ్వరరెడ్డి, జాకీర్, హుసేన్, దస్తగిరిబాషా, రాజ్‌కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీల్లో 'గురురాజ'కు డబుల్ క్రౌన్

నంద్యాల(న్యూటౌన్): పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ త్రోబాల్ టోర్నమెంట్ పోటీల్లో శ్రీగురురాజ ఇంగ్లిష్ మీడియం క్రీడాకారులు డబుల్‌క్రౌన్ సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్లు షేక్షావలి రెడ్డి, మౌలాలిరెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీగురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం జరిగిన 8వ ఉమ్మడి జిల్లా స్థాయి త్రోబాల్ టోర్నమెంట్ పోటీలకు వంద జట్లకు పైగా పాల్గొన్నాయన్నారు. ఈ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రవికృష్ణ అభినందించారు. బాలుర విభాగంలో ప్రథమస్థానం గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ద్వితీయ స్థానం విజ్ఞాన పీటం కర్నూలు, తృతీయ స్థానం కేశవరెడ్డి పాఠశాల, నాల్గవ స్థానం జెడ్పీహెచ్ఎస్ భాగ్యనగరం నిలువగా బాలికల విభాగంలో ప్రథమ స్థానం గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, ద్వితీయ స్థానం గుడ్‌షెప్పర్డ్, తృతీయ స్థానం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ నిలిచాయి.

వక్ఫ్ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం దారుణం



మాట్లాడుతున్న యూనుస్

నంద్యాల(అర్బన్): వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం దారుణమని, వక్ఫ్ ఆస్తులు దోచుకోవడానికి బీజేపీ పన్నిన పన్నాగంలో చంద్రబాబు భాగస్వామి అయ్యారని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనుస్ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమితి జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేష్, ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు.. వక్ఫ్ ఆస్తులు కాపాడుతామంటూ అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. ఉర్దూ స్పెషల్ డీఎస్సీ, దుల్హన్, దుకాన్–మకాన్, ఎంఎఫ్‌సీ ద్వారా సబ్సిడీ రుణాలు, ఇస్లామిక్ బ్యాంక్ విధానం, విజయవాడలో హజ్‌హౌస్ నిర్మాణం తదితర హామీలను చంద్రబాబు మరిచిపోయారన్నారు. ముస్లిం మైనార్టీల హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించే అర్హత లేదన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు అవుతున్నా మౌజన్, ఇమామ్‌ల గౌరవ వేతనం ఇవ్వలేదని చెప్పారు. రాబోవు రోజుల్లో ముస్లిం మైనార్టీలు ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాబ్‌బాషా, ఖాజాబాబా తదితరులు పాల్గొన్నారు.

దస్తగిరిరెడ్డికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు పురస్కారం



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందుకుంటున్న దస్తగిరిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి ఇండియా బుక్ ఆఫ్ రికార్డు నుంచి అత్యుత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయ నిర్ణీత డాక్టర్ ఎస్.వసుధారాణి హాజరై అవార్డును అందజేశారు. శ్రీరామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లా ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌ట్యాప్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, టీచర్స్ యూనియన్ కో ఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసరెడ్డి, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తదితరులు పాల్గొని దస్తగిరిరెడ్డి సేవలను కొనియాడారు. వారు మాట్లాడుతూ గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేతగా దస్తగిరిరెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వర్తించారని, సేవలకు గుర్తుగా విశిష్టమైన ఇండియా బుక్ ఆఫ్ రికార్డును అందించడం సంతోషంగా ఉందన్నారు. నిరుద్యోగుల కోసం తన ఉద్యోగాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రికార్డు స్థాయిలో 50వేల మందికి ఉద్యోగాలు ఇప్పించిన ఆయన శ్రమకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డుతో సార్థకత చేకూరిందన్నారు. సొంత గ్రామంలో 10 ఎకరాల విస్తీర్ణంలో కార్పొరేట్ ఆసుపత్రిని స్థాపించి ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, తెలుగు రచయిత అన్నెం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు పాటుపడాలి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతంలోని విలువైన వృక్ష సంపదతో పాటు వన్య ప్రాణుల సంరక్షణకు పాటుపడాలని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు సిబ్బందికి సూచించారు. రుద్రవరంలోని అటవీ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం అటవీ అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది విధి నిర్వాహణలో ప్రాణాలు కోల్పోయిన అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ఎర్ర చందనం అక్రమ రవాణా, వన్య ప్రాణుల వేట, అటవీ భూముల ఆక్రమణ జరక్కుండా కృషి చేయాలని సూచించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు బీఓసీని తక్షణమే పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. చౌడప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు కావస్తున్నా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొని వచ్చిన నూతన ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోనెం.17ను రద్దు చేసి ఓబీసీ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మికులు రఫీ, ఖాజామి యా, అన్నయ్య, పఠాన్ యాకూబ్, సుబ్బయ్య, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలు, సభలు జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈనెల 26న చేపట్టనున్న ర్యాలీలు, సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రూ.19.28 లక్షల కోట్ల రుణమాఫీ పన్నురాయితీ ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని కార్పొరేట్‌లకు దోచిపెట్టి.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌తో సహా పరిశ్రమలు, గనులు సముద్ర తీరాన్ని కారుచవకగా కట్టబెడుతోందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు బాలవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా పెద్దముడియం మండలం నెమ్మలదిన్నె గ్రామస్తుడు తలారి లక్ష్మయ్యకు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం చాగలమర్రి పోలీసులు సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. జమ్మలమడుగులోని పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్‌తో అక్రమంగా విక్రయించటానికి చాగలమర్రికి తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక కులూరు రస్తాలో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

నేటి బాలలే భావిభారత పౌరులు



భక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

నంద్యాల(న్యూటౌన్): నేటి బాలలే భావిభారత పౌరులని, వారికి తల్లిదండ్రులు మంచి నడవడిక నేర్పాలని నంద్యాల డయాసిస్ ఇన్‌చార్జ్ బిషప్ రైట్ రెవరెండ్ జార్జి కొర్నెల్ అన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-2 ఆల్ సెయింట్ చర్చ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన చిన్నపిల్లల సండేస్కూల్ భవనాన్ని బిషప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలను దగ్గరకు తీరుస్తూ వారికి మంచి బోధనలు చెప్పాలన్నారు. చిన్నపిల్లలను బైబిల్ క్విజ్ పోటీల్లో సండే స్కూల్ టీచర్స్ రాణించాలన్నారు. అనంతరం ఆల్ సెయింట్ చర్చ్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో నంద్యాల డయాసిస్ సెక్రటరీ విలియమ్ స్టాలిన్, పాస్టరేట్-2 సెక్రటరీ కిరణ్‌కుమార్, బాలయ్య, బైబిల్ సొసైటీ సెక్రటరీ కిరణ్, డయాసిస్ ఉపాధ్యక్షులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న ర్యాలీతో పాటు బహిరంగ సభ ఉంటుందన్నారు. నంద్యాల జిల్లా విద్యారంగ అభివృద్ధిపై జిల్లా మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, టీటీసీ, బీఈడీ కళాశాలలు, రాయలసీమ యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, నాయకులు తరుణ్, సంతోష్, ఎర్రిస్వామి, వెంకటేష్, సుధాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.